సాక్షి ఒడిశా

సోమవారం । 11 । మార్చి । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం ఆదివారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,45,479లు, బంగారం 4గ్రాముల 850 మిల్లీగ్రాములు, వెండి 37గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



మహిళలు స్వయం కృషితో ఎదగాలి

మహిళలు స్వయం కృషితో ముందుకు సాగాలని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి అన్నారు. బ్రాహ్మణ వీధిలో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు.

- 8లో



మల్కన్‌గిరిలో స్వచ్ఛభారత్

మల్కన్‌గిరి కళాశాలలో ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. విద్యార్థులు కాలేజీ ఆవరణలోని చెత్తాచెదారాలను తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు.

- 8లో

న్యూస్‌రీల్

నేత్ర వ్యాధులపై అప్రమత్తం



ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ రాధామాధవ్, ప్రొఫెసర్ నాగేశ్వర్

బరంపురం : కళ్లకు సంబంధించి గ్లకోమా వ్యాధి బారిన పడకుండా ప్రతిఒక్కరూ చైతన్యం కావాలని ఎంకేసీజీ కంటి విభాగం హెచ్‌ఓడీ ప్రొఫెసర్ కె.నాగేశ్వర్ సుబుద్ధి కోరారు. ఎంకేసీజీ కంటి విభాగం ఆధ్వర్యంలో ఆదివారం గ్లకోమా వారోత్సవాలను ప్రిన్సిపాల్ రాధామాధవ్ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కంటి వైద్యులు, ఎన్‌జీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

సారాబట్టీలపై దాడులు



దాడులు నిర్వహిస్తున్న సిబ్బంది

జయపురం: సబ్ డివిజన్‌లోని కుంద్ర సమితి లిమ్మ గ్రామ సమీపంలో నదీ ప్రవాహక ప్రాంతంలో సారా బట్టీలపై అబ్కారీ సిబ్బంది దాడులు చేపట్టారు. రెండు వేల లీటర్ల బెల్లం ఊట, 150 లీటర్ల సారా ధ్వంసం చేశారు. బాలాగుడ, కుంబారిగుడ, దిగాపూర్ గ్రామాల్లో సారా అమ్ముతున్న ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ దాడుల్లో నందపూర్ అబ్కారీ అధికారి అన్నపూర్ణ రథ్, శొశికాంత దత్, రశ్మీ రంజన్ నాయిక్, ఏఎస్‌ఐ హలధర జాని తదితరులు పాల్గొన్నారు.

25 నుంచి ప్రైవేటు బస్సుల బంద్



సమావేశంలో మాట్లాడుతున్న నరేంద్ర మహంతి

జయపురం: ప్రభుత్వం జిల్లా కేంద్రాలకు లక్ష్మీ బస్సులు నడిపేందుకు నిర్ణయం తీసుకున్నందుకు నిరసనగా ఈ నెల 25 నుంచి ప్రైవేటు బస్సుల బంద్ చేపట్టనున్నట్లు ప్రైవేట్ బస్సు ఓనర్స్ అసోసియేషన్ ప్రకటించింది. ఈ మేరకు ఆదివారం జయపురం జిల్లా ప్రైవేట్ బస్సు ఓనర్ల అసోసియేషన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించారు. జిల్లా కేంద్రాలకు లక్ష్మీ బస్సులను నడపాలన్న ప్రభుత్వ నిర్ణయంపై సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు. కొరాపుట్ జిల్లా ప్రైవేట్ బస్సు యజమానుల సంఘ సాధారణ కార్యదర్శి, అవిభక్త కొరాపుట్ జిల్లా ప్రైవేట్ బస్సు యజమానుల సంఘాల కోఆర్డినేటర్ నరేంద్ర మహంతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సలహాదారు సుశాంత అధికారి, బి.సుబ్రహ్మణ్య పాత్రో, బసంత కుమార్ బిశ్వాల్, ప్రశాంతకుమార్ పాణిగ్రహి, ఎన్.శంకరరావు, నరేష్ పాడి, అశోక్ మహాపాత్ర, షేక్ కాశీం తదితరులు పాల్గొన్నారు.

చెరువులో మునిగి వ్యక్తి మృతి



నారాయణ బెహరా మృతదేహాన్ని ఒడ్డుకు చేరుస్తున్న అగ్నిమాపక సిబ్బంది

బరంపురం : నగర శివారులోని నిమ్మఖండి చెరువులో జారిపడి వ్యక్తి మృతిచెందాడు. ఐఐసీ అధికారి శిబశంకర్ మహాపాత్రో తెలిపిన వివరాల ప్రకారం.. సదర్ పోలీసుస్టేషన్, నిమ్మఖండి ఔట్ పోస్ట్ పరిధిలోని నిమ్మఖండి గ్రామానికి చెందిన నారాయణ బెహరా(40) ఆదివారం ఉదయం చెరువులో స్నానానికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు మునిగిపోయి మృతిచెందాడు. సమాచారం అందుకున్న బరంపురం అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. సుమారు 2 గంటల తర్వాత నారాయణ బెహరా మృతదేహాన్ని ఒడ్డుకి చేర్చారు. పోస్టు మార్టం నిమిత్తం ఎంకేసీజీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఐఐసీ అధికారి ఎస్‌ఎస్ మహాపాత్రో తెలిపారు.

కొత్తగా 274 రైల్వే ప్రాజెక్టులు



- ఖుర్దారోడ్ డీఆర్‌ఎం బాజ్వా
- 12న వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సేవలు ప్రారంభం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఎం హెచ్.ఎస్.బాజ్వా

భువనేశ్వర్:

రాష్ట్రంలో కొత్తగా 274 ప్రాజెక్టులు అందుబాటులోకి రానున్నాయని ఖుర్దా రోడ్ డివిజనల్ రైల్వే మేనేజర్ హెచ్.ఎస్.బాజ్వా ప్రకటించారు. ఇందులో కొన్ని ప్రాజెక్టుల్ని ప్రధాని నరేంద్ర మోదీ జాతికి అంకితం చేసి మిగిలిన భావి ప్రాజెక్టులకు వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఈ నెల 12న శంకుస్థాపన చేయనున్నారని వెల్లడించారు. ఆదివారం భువనేశ్వర్‌లోని మండల రైల్వే అధికారి కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తొలి ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రం (పీఎంబీజేకే)ను ప్రధాని మోదీ ఖుర్దా రోడ్ రైల్వే స్టేషన్‌లో ప్రారంభిస్తారని చెప్పారు. ఈ కేంద్రంలో తక్కువ ధరకే నాణ్యమైన ఔషధాలు లభిస్తాయని తెలిపారు. జాతీయ స్థాయిలో ఎంపిక చేసిన ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధి కేంద్రాల్లో ఇదొకటని పేర్కొన్నారు. ఇక్కడ 1,965 రకాల మందులు లభిస్తాయని చెప్పారు.

మూడో వందే భారత్ ఎక్స్‌ప్రెస్

రాష్ట్రానికి మూడో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవలు అందుబాటులోకి రానున్నాయని డీఆర్‌ఎం చెప్పారు. ఈ నెల 12 నుంచి పూరీ, విశాఖపట్నం మధ్య మూడో వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సేవల్ని ప్రధాన మంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ రైలులో అధునాతన సౌకర్యాలతో తక్కువ వ్యవధిలో ప్రయాణికులకు సుఖమంతమైన ప్రయాణం సాధ్యమవుతుందన్నారు. అదే విధంగా, ఖుర్దారోడ్ రైల్వే మండలంలో భద్రక్, నెరుగుండి మధ్య మూడో లైనుని పీఎం ప్రారంభిస్తారని చెప్పారు. ఈ రెండు స్టేషన్ల మధ్య 92.19 కిలోమీటర్ల పొడవునా ఇటీవల నిర్మించిన ఈ కొత్త లైనును జాతికి అంకితం చేస్తారని పేర్కొన్నారు. స్థానిక ఉత్పత్తుల ప్రోత్సాహంతో పాటు బలహీన వర్గాలకు మెరుగైన జీవనోపాధిని అందించడానికి రాష్ట్ర వ్యాప్తంగా రైల్వే స్టేషన్లలో కొత్తగా 41 చోట్ల 'ఒక స్టేషన్ ఒక ఉత్పత్తి కేంద్రాల్ని' జాతి సేవకు అంకితం చేయనున్నారని తెలిపారు. తొలి విడత కింద ఖుర్దారోడ్‌లో పదకొండు రైల్వే స్టేషన్లలో ఒక స్టేషన్ ఒక ఉత్పత్తి కేంద్రాలు ప్రారంభమవుతాయన్నారు. ఈ జాబితాలో పూరీ, భువనేశ్వర్, కటక్, భద్రక్, ఖుర్దా రోడ్, బలుగాంవ్, ఛత్రపూర్, బరంపురం, పలాస, అంగుల్, ఢెంకనాల్ రైల్వే స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. 92.19 కి.మీ పొడవున్న భద్రక్-నెరగుండి 3వ లైన్ ప్రాజెక్ట్ జాతికి అంకితం చేస్తారని, ఈ ప్రాజెక్టు ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసి హౌరా, చెన్నై ప్రధాన రైలు మార్గంలో అవాంతరాలు లేని రైలు కార్యకలాపాలకు దోహదపడుతుందని డీఆర్‌ఎం వివరించారు.

లోక్ అదాలత్‌కు విశేష స్పందన



బరంపురం: కేసులు పరిష్కరిస్తున్న జిల్లా జడ్జి ఆనంద చంద్ర బెహరా

బరంపురం : జాతీయ లోక్ అదాలత్‌కు విశేష స్పందన లభించింది. శని, ఆదివారాల్లో బరంపురం జిల్లా కోర్టు ప్రాంగణంలోని సివిల్ కోర్టు పరిసర ప్రాంతంలో జరిగిన మొదటి జాతీయ లోక్ అదాలత్‌లో వందలాది కేసులు పరిష్కారమయ్యాయి. జిల్లా జడ్జి ఆనంద చంద్ర బెహరా ముఖ్య అతిథిగా పాల్గొని లోక్ అదాలత్ ప్రారంభించారు. మోటార్ యాక్సిడెంట్, బ్యాంక్ రుణాలు, దుర్ఘటనలు, బీమా వంటి 132 కేసులు పరిష్కరించి రూ.5.70 కోట్లు చెక్కులు వసూలు చేశారు. కార్యక్రమంలో గంజాం జిల్లా లీగల్ సెల్ అథారిటీ ప్రతినిధులు టి.తిరుమల రెడ్డి, ప్రసాద్ పాత్రో తదితరులు పాల్గొన్నారు.

– కొరాపుట్ జిల్లాలో 3427 కేసుల పరిష్కారం



జయపురం: కేసులు విచారిస్తున్న జిల్లా జడ్జి శ్రీమిశ్రా

జయపురం: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవా ప్రదీకరణల సూచనల మేరకు శనివారం జయపురం జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 3427 కేసులు పరిష్కరించారు. కొరాపుట్ జిల్లా జడ్జి, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ అధ్యక్షుడు సత్యనారాయణ మిశ్రా ఈ అదాలత్‌ను ప్రారంభించారు. జిల్లా కోర్టులోనే కాకుండా కొరాపుట్, కొట్‌పాడ్, లక్ష్మీపూర్, సెమిలిగుడ, బొరిగుమ్మ, దసమంతపూర్, లమతాపుట్ కోర్టుల్లోనూ లోక్ అదాలత్‌లు నిర్వహించినట్లు జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి సుమన్ జెన తెలిపారు. ఆయా కేసులు పరిష్కరించి రూ.3 కోట్ల15 లక్షల 35 వేల 655లను జరిమానా, పరిహారం రూపంలో వసూలు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో స్వతంత్ర విజిలెన్స్ జడ్జి రాజేష్ ఎక్కా, ఫ్యామిలీ కోర్టు జడ్జి ధనేశ్వర మల్లిక్, అదనపు జిల్లా జడ్జి, పోస్కో విచారపతి సీహెచ్ బాసుదేవ్ పాత్రో, ముఖ్య విభాగజడ్జి శంతనుకుమార్‌దాస్, కార్మిక న్యాయ స్థానం జడ్జి బిద్యాధర పుష్టి, సీనియర్ జడ్జి రేఖారాణీ పండ, మహిళా కోర్టు జడ్జి అంజలీ మాహఖండ్, జిల్లా న్యాయ సేవా ప్రదీకరణ కార్యదర్శి, లోక్ అదాలత్ శాశ్వత విచారపతి సుమన్ జెన, రిజిస్ట్రార్ బిష్ణు ప్రసాద్ దేవత, సబ్ డివిజనల్ జడ్జి సంతోష్‌కుమార్ బారిక్ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి విలువైన గంజాయి సీజ్



ట్రక్కులో సీజ్ చేసిన గంజాయితో బరంపురం ఎక్సైజ్ అధికారులు

బరంపురం : గంజాం జిల్లాలో రోజురోజుకు గంజాయి మాఫియా ఆగడాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఆదివారం నగర సమీపంలోని 16వ నంబర్ జాతీయ రహదారిలో అరటి పండ్ల లోడుతో వెళ్తున్న ట్రక్కు, స్విఫ్ట్ కారులో అక్రమంగా రవాణా అవుతున్న గంజాయిని బరంపురం అబ్కారీ విభాగం అధికారులు దాడులు చేసి స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.కోటికి పైగా ఉంటుందని బరంపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామచంద్ర మిశ్రా తెలిపారు. బరంపురం మీదుగా ఆంధ్రప్రదేశ్ వైపు వెళ్తుండగా గోళంతరా పోలీసుస్టేషన్ పరిధిలోని హల్దియాపదర్ జాతీయ రహదారిలో తనిఖీలు చేపట్టి పట్టుకున్నట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ అధికారి రమేంద్ర నారాయణ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు. ఇదే విధంగా కొంధమాల్ జిల్లా నుంచి బరంపురం వైపు వస్తున్నా హోండా సిటీ కారులో అక్రమంగా గంజాయి రవాణ అవుతున్నట్లు సమాచారం అందడంతో తనిఖీలు చేయగా 82 కిలోల గంజాయిని బల్లిగుడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పరారయ్యారు.



కారులో గంజాయిని సీజ్ చేసిన బల్లిగుడా పోలీసులు

యువతి అనుమానాస్పద మృతి



భగవతి (ఫైల్)

జయపురం: బొయిపరిగుడ సమితి ఆర్.భల్లుగాం చంద్ర బారిక్ ఇంట్లో ఆదివారం యువతి అనుమానస్పదంగా మృతిచెందింది. ఈమె గుప్తేశ్వర్ పంచాయతీ ముర్జాచువ గ్రామానికి చెందిన సుకల్ దురువ కుమార్తె భగవతి దురువగా గుర్తించారు. సమాచారం తెలుసుకున్న ఆమె సోదరుడు మిటు దురువ వచ్చి మృతదేహాన్ని పరిశీలించాడు. తన సోదరిని హత్య చేశారని ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. శుక్రవారం శివరాత్రి నాడు భగవతి జితేంద్రతో కలిసి గుప్తేశ్వర్ వెళ్లిందని, ఆదివారం ఉదయం చూసేసరికి జితేంద్ర ఇంట్లో హత్యకు గురైందని సోదరుడు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. అనంతరం కేసు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు చంద్రబారిక్, అతడి కుమారుడు జితేంద్ర బారిక్‌లను ను అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణకు సైకిల్‌యాత్ర



సైకిల్ యాత్ర చేపడుతున్న నెదర్లాండ్ దంపతులు

మల్కన్‌గిరి: నెదర్లాండ్‌కు చెందిన ఆత్రేయు అనాధా, ఎలినా మిలినీయార్ దంపతులు పర్యావరణ పరిరక్షణ కోరుతూ సైకిల్ యాత్ర చేపట్టారు. ఆదివారం మల్కన్‌గిరి చేరుకుని ప్రజల్లో చైతన్యం కల్పించారు. వీరిని జిల్లా యంత్రాంగం అభినందించారు. ఈ జంట నాలుగు నెలల్లో 4500 కిలోమీటర్లు ప్రయాణించారు. ఛత్తీస్‌గఢ్‌లో పర్యటించి ఇక్కడికి చేరుకున్నట్లు దంపతులు తెలిపారు.

సాహిత్యంతో సమాజ చైతన్యం



హరహర కరసుధా పట్నాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

జయపురం: సమాజ చైతన్యానికి సాహిత్యం మార్గదర్శకం కావాలని ప్రముఖ సాహితీవేత్త శ్రీనాథ్ మిశ్రా అన్నారు. ఆదివారం జయపురం ఉపాధ్యాయ శిక్షణా కేంద్రంలో జానకీ పాణిగ్రాహి రచించిన రెండు కవితా సంకలనాలను ఆవిష్కరించారు. రచయితలు నళినీ రంజన్ మిశ్ర, చంద్రకాంత బిశ్వాల్, ఉదయశంకర జాని, ప్రకాశ్‌దాస్, విజయలక్ష్మీ తదితరులు ప్రసంగించారు. అనంతరం ప్రముఖ రచయిత హరిహర కర సుధా పట్నాయక్‌ను సన్మానించారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు



సేంద్రియ ఎరువుల ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మకరంద ముదులి

రాయగడ: సేంద్రియ ఎరువుల వినియోగంతో అధిక దిగుబడులతో పాటు పంట భూములు సారవంతమవుతాయని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి అన్నారు. స్థానిక బిజు పట్నాయక్ ఆడిటోరియంలో జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఎరువుల వినియోగం-తీసుకోవాల్సిన జాగ్రత్తలు అనే అంశంపై ఆదివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ కొందరు రైతులు అవగాహన లోపంతో మితిమీరి రసాయనాలు వాడటంతో నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సేంద్రియ ఎరువులు వినియోగిస్తే మంచి దిగుబడులతో పాటు భూములు సస్యశ్యామలంగా మారుతాయని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మిల్లెట్ మిషన్ ప్రారంభమయ్యాక ఆదివాసీ రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా చేసుకున్నారని ఆనందం వ్యక్తం చేశారు. కలెక్టర్ మనోజ్ సత్యవాన్ మహజన్ మాట్లాడుతూ సేంద్రీయ ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలో వ్యవసాయ రంగం ఎంతగానో అభివృద్ధి చెందిందన్నారు. వాణిజ్య పంటలపై ఆసక్తి కనబరుస్తున్న నేపథ్యంలో అందుకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి మనోజ్‌కుమార్ ప్రధాన్, ఎస్‌డీసీ చైర్మన్ అనసూయ మాఝి తదితరులు ప్రసంగించారు. అంతకుముందు సేంద్రియ ఎరువుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు.



కార్యక్రమానికి హాజరైన రైతులు

గోండో గిరిజనుల ఉన్నతికి కృషి



ప్రసంగిస్తున్న సీఎం నవీన్, పాండ్యన్, ఎంపీ రమేష్

కొరాపుట్: గిరిజనుల్లో గోండోజాతి తెగ ఉన్నతికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ భరోసా ఇచ్చారు. ఆదివారం భువనేశ్వర్‌లోని చంద్రశేఖర్‌పూర్‌లో రు.3 కోట్లతో నిర్మించనున్న గోండో భవన్‌కు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాష్ట్రంలో 21 జిల్లాల్లో గోండో జాతీయులు ఉన్నారని, వారి చిరకాల కోరిక రాజధానిలో వారికి భవనం ఉండాలన్నదేనని గుర్తు చేశారు. అందుకే భారీ ఎత్తున భవనం నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో 5టీ కార్యదర్శి వి.కార్తికేయ పాండ్యన్, గోండో జాతికి చెందిన నబరంగ్‌పూర్ పార్లమెంట్ సభ్యుడు రమేష్ చంద్ర మజ్జి, కమిటీ సభ్యులు, గోండో జనం పాల్గొన్నారు.



హాజరైన గోండో ప్రజలు

పోలీసులకు చిక్కిన సెల్‌ఫోన్ల దొంగ

మల్కన్‌గిరి: సెల్‌ఫోన్లను చోరీ చేసిన యువకుడిని పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలోని కొరుకొండ సమితి ఒరికాల్ గ్రామం వద్ద ఓ మొబైల్ షాప్‌లో ఈ నెల 6న ఐదు సెల్‌ఫోన్లు, రూ.3 వేల నగదు చోరీకి గురయ్యాయి. ఈ విషయమై యజమాని సంజియ్‌దాస్ సానీయా ఈ నెల 7న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన ఐఐసీ సహమస్ పట్నాయక్ ఆదివారం కొరుకొండ సమితి చిత్తపరి గ్రామంలో నిందితుడు ఘసిరామ్‌ను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి ఐదు సెల్‌ఫోన్లు, రూ.1560 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

పరోపకారంతో మెలగాలి

కొరాపుట్:

దేవుడి పేరిట మోసాలకు పాల్పడకుండా పరోపకారంతో మెలగాలని అంతర్జాతీయ షిర్డీ సాయి భక్త ప్రబోధకుడు చంద్రభాను సత్పతి అన్నారు. ఆదివారం నబరంగ్‌పూర్ జిల్లా చైనా మార్కెట్‌లో షిర్డిసాయి మందిరాన్ని సందర్శించి ప్రసంగించారు. సాయిభక్తులు ఎల్లప్పుడూ నిర్మలంగా, నిశ్చలంగా ఉండాలన్నారు. ప్రచారాలకు, ప్రలోభాలకు దూరంగా ఉంటూ పరోపకారం లక్ష్యంగా నడవాలన్నారు. సాయి పేరుతో మోసాలు చేయకూడదన్నారు. కొరాపుట్ జిల్లా కొట్‌పాడ్ పట్టణంలో షిర్డీసాయి మందిరం ప్రతిష్ఠకు వెళ్లి.. నబరంగ్‌పూర్ భక్తుల విజ్ఞప్తి మేరకు ఇక్కడికి రావలసి వచ్చిందన్నారు.



షిర్డీసాయికి పూజలు చేస్తున్న చంద్రభాను సత్పతి

క్లుప్తంగా

టెక్కలిలో పోలీసుల కవాతు

టెక్కలి రూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో టెక్కలి పరిసర ప్రాంతాల్లో ఆదివారం పోలీసు కవాతు నిర్వహించారు. టెక్కలి ఎస్‌ఐ లక్ష్మి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ఇందిరాగాంధీ జంక్షన్ మీదుగా అంబేడ్కర్ జంక్షన్ వరకు అక్కడి నుంచి నాలుగురోడ్ల జంక్షన్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భాగంగా సుమారు 70మంది సెంట్రల్ స్పెషల్ పోలీస్ ఫోర్సు సిబ్బంది పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ర్యాలీలో టెక్కలి ఎస్‌ఐ-2 వెంకటేశ్వరరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

‘పొందూరు ఖాదీని వారసత్వ సంపదగా గుర్తించాలి’

పొందూరు: పొందూరు ఖాదీని ప్రత్యేక కళగానూ, వారసత్వ సంపదగానూ ప్రభుత్వాలు గుర్తించాలని ఇంటాక్ (భారతీయ జాతీయ కళలు సాంస్కృతిక వారసత్వ సంస్థ) కన్వీనర్ నూక సన్యాసిరావు అన్నారు. ఆదివారం పొందూరు ఏఎఫ్‌కేకే సంఘాన్ని సందర్శించిన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పొందూరు ఖాదీని చేనేతతో పోల్చడం సరికాదని అన్నారు. ఖాదీ సంస్థ అభివృద్ధికి కావాల్సిన రుణాలను నాబార్డు ద్వారా అందించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అనంతరం ఖాదీ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు దండా వెంకటరావు, కామేశ్వర ప్రసాద్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఇంటాక్ కో కన్వీనర్ వావిలపల్లి జగన్నాధరావు, మాజీ కన్వీనర్ రాధా ప్రసాద్, మాజీ కో-కన్వీనర్ సురంగి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

జీడి పరిశ్రమలో అగ్నిప్రమాదం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని అన్నపూర్ణ సినిమా థియేటర్ వద్ద ఉన్న జీడి పరిశ్రమలో ఆదివారం మధ్యాహ్నం అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్ షార్ట్ షర్క్యూట్ కారణంతో వరుణ్ క్యాష్యూ జీడి పరిశ్రమలో మంటలు అంటుకున్నాయి. భోజన విరామం కావడంతో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. గోదాంలో ఉన్న జీడిపప్పు నిల్వల వద్ద మంటలు చెలరేగగా కాశీబుగ్గ ఫైర్ అధికారులు మంటలను అదుపు చేశారు. పట్టణం మధ్యలో పరిశ్రమ ఉండటంతో స్థానికులంతా భయాందోళనకు గురయ్యారు.

తృటిలో తప్పిన ప్రమాదం

టెక్కలి: టెక్కలి నవీన్‌నగర్‌లో ఆదివారం రాత్రి తృటిలో ఘోర ప్రమాదం తప్పింది. నిర్మాణంలో ఉన్న ఓ భవనానికి కట్టిన పరంజా కర్రలు ఒక్క సారిగా విద్యుత్ ఎల్‌టీ లైన్లపై పడ్డాయి. దీంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వైర్లపై పడిన కర్రలను వేరు చేశారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వైర్లు తెగకపోవడంతో ఎలాంటి ప్రమాదం సంభవించలేదు.

పోలీసుల ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

మందస, కాశీబుగ్గ: మందస పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా రెండు రోజుల పాటు వాలీబాల్, క్రికెట్ పోటీలు జరుగుతాయి. పోటీలను కాశీబుగ్గ డీఎస్పీ నాగేశ్వరరెడ్డి ప్రారంభించారు. కాశీబుగ్గ పోలీసు క్రీడా మైదానంలో ఎస్పీ కప్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు కాశీబుగ్గ పోలీసు డివిజన్ అధికారి నాగేశ్వరరెడ్డి క్రీడాపోటీలను ప్రారంభించి క్రీడాకారులకు పరిచయం చేసుకున్నారు.

పూర్తయిన ప్రవేశ పరీక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు ఆదివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష సజావుగా జరిగింది. ఈ పరీక్షలు జిల్లాలో 9 కేంద్రాల్లో నిర్వహించారు. 5వ తరగతి ప్రవేశ పరీక్షకు 11,674 మంది దరఖాస్తు చేసుకోగా 1418 మంది హాజరయ్యారు. 256 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ ప్రవేశ పరీక్షకు 1479 మంది దరఖాస్తు చేసుకోగా 1329 మంది హాజరయ్యారు. 150 మంది గైర్హాజరయ్యారు. పలు కేంద్రాలను జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ సమన్వయాధికారి ఎస్.బాలాజీ పరిశీలించారు.

మార్కెట్‌లో బ్రకోలీ సందడి

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ, పరిసర ప్రాంతాల్లో బ్రకోలి పంట సందడి చేస్తోంది. దేశీ బ్రకోలీని స్థానిక రైతులు పండించి వాటిని పట్టణానికి తరలిస్తున్నారు. ఇప్పుడిప్పుడే నెమ్మదిగా ఈ పంట విస్తరిస్తోంది. కిలో రూ.50పైగా పలుకుతోంది.



కాశీబుగ్గ మార్కెట్‌లో బ్రకోలి అమ్మకాలు

మహిళలు స్వయం కృషితో ఎదగాలి

రాయగడ: మహిళలు స్వయం కృషితో ముందుకు సాగాలని రాయగడ ఎమ్మెల్యే మకరంద ముదులి అన్నారు. స్థానిక బ్రాహ్మణ వీధిలోని శక్తి వాహిని ఆధ్వర్యంలో మున్సిపాలిటీ టౌన్ హాల్‌లో ఆదివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక సాధికారితకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రత్యేక అభివృద్ధి మండలి చైర్మన్ అనసూయ మాఝి మాట్లాడుతూ ఆదివాసీ, హరిజన ప్రాంతమైన ఈ జిల్లాలో మహిళలు అన్ని రంగాల్లోనూ అభివృద్ధి సాధిస్తున్నారని చెప్పారు. శక్తి వాహిని మహిళా సంస్థ అధ్యక్షురాలు సుబ్రా పండా మాట్లాడుతూ బ్రాహ్మణ వీధి మహిళలంతా కలిసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం సంస్థ కార్యదర్శి మీనాకుమారి రథ్ సంస్థ వార్షిక నివేదికను చదివి వినిపించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు మేజిస్ట్రేట్ భాస్కర రైతా, న్యాయవాది మదన్‌మోహన్ పాఢి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ తెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో..

పర్లాకిమిడి: రాష్ట్రీయ తెలుగు సమాఖ్య (కోల్‌కోతా) సమన్వయకర్త పూర్ణలత జూమ్ విధానంలో ఆదివారం మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముందుగా మహిళా విభాగం అధ్యక్షురాలు లంక సీత మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. మాతృభాష, సంస్కృతి పరిరక్షణకు మహిళలు ముందుకురావాలని కూచుముంది మెహర్ పిలుపునిచ్చారు. అనంతరం వివిధ రాష్ట్రాల నుంచి 38 మంది మహిళలు విభిన్న అంశాలపై మహిళా దినోత్సవంపై మాట్లాడారు. కె.వి.బి.ఎస్.శర్మ, రాళ్లపల్లి పద్మ, పొన్నాడ ప్రసాద్‌లు వ్యాఖ్యాతలుగా వ్యవహరించారు. అనంతరం వివిధ రాష్ట్రాలలో పేరుగాంచిన మహిళామణులకు విశిష్ట పురస్కారాలు అందజేశారు. పర్లాకిమిడికి చెందిన డాక్టర్ పాండ్రంగి శారదకు బంగారు నంది అవార్డు అందుకున్నారు. భారతీయం సత్యవాణి (హైదరాబాద్), కూచిపూడి నృత్య కళాకారిణి డాక్టర్ అనురాధా వెంకటకృష్ణ (నైవేలి), వసుంధర జాతీయ అవార్డు కర్ర శశికళ రెడ్డి (హైదరాబాద్), క్వీన్ విక్టోరియా గంధం (హైదరాబాద్) పద్మశ్రీగ్రహీత డాక్టర్ ఉమా మహేశ్వరీ భాగవతారణి అవార్డులు అందుకున్నారు. పర్లాకిమిడిలో జరిగిన సన్మాన కార్యక్రమంలో కళింగ వైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు, చైతన్య సమితి మహిళా సంఘం సభ్యులు కోట్ని శోభారాణి తదితరులు పాల్గొన్నారు. రేఖానావీధిలో ఉపాధ్యాయురాలు డాక్టర్ పాండ్రంగి శారదను సన్మానించారు.

మహిళా రైతుకు సన్మానం

జయపురం: జయపురం సబ్ డివిజన్ కుంద్రా సమితి నువాగుడ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళా రైతు రొయిమతి ఘివురియను బ్రిక్స్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా సంయుక్తంగా న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన బ్రిక్స్ చాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీస్ సంస్థ న్యూఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రొయిమతి ఘివురియ వ్యవసాయ రంగానికి అందిస్తున్న సేవలకు మెచ్చి సత్కరించారు. రొయిమతి జైవిక పద్ధతిలో సంప్రదాయ వ్యవసాయం చేస్తూధాన్యం, చోళ్ల వంగడాలను సంరక్షించడమే కాకుండా గ్రామీణ మహిళలకు శిక్షణ ఇస్తున్నారు.



రాయగడ: కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, సంస్థ సభ్యులు



జయపురం: రొయిమతిని సన్మానిస్తున్న బ్రిక్స్ ప్రతినిధులు



రాయగడ: జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే ముదులి



పర్లాకిమిడి: డాక్టర్ పాండ్రంగి శారదను సన్మానిస్తున్న కళింగ వైశ్య మహిళా సంఘం, చైతన్య మహిళా సమితి బృందం

డోలోత్సవానికి వేళాయెె

- 12 నుంచి 25 వరకు చక్రధరుని డోలోత్సవాలు



బెజ్జిపుట్టుగలో వెలసిన చక్రపెరుమాళ్లు ఆలయం



బెజ్జిపెట్టుగలో వెలసిన శ్రీదేవీభూదేవీసమేత చక్ర పెరమాళ్లు

కవిటి: బెజ్జిపుట్టుగలో వెలసిన శ్రీచక్రధర పెరుమాళ్ల డోలోత్సవానికి సమయం ఆసన్నమైంది. రాష్ట్రంలో మరెక్కడా లేనివిధంగా 14 రోజుల పాటు ఉత్సవాలు ఈ ఆలయంలో అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్, ఒడిశాకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో ఉత్సవాల్లో పాల్గొంటారు. చక్రధరుని డోలోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఉదయం సుప్రభాత సేవతో ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మార్చి 25వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. ఉత్సవాలు జరిగే అన్ని రోజులు పల్లకీ సేవ, గరుడ వాహన సేవలు నిర్వహిస్తారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు పొందల రామస్వామి, అప్పారావునాయుడుల కుటుంబాల వారు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. కవిటి, ప్రగడపుట్టుగ, పిరియావీధి, బార్లవీధులకు చెందిన వారు ఒక్కొక్క గ్రామం ఒక రోజు ఈ ఉత్సవాల్లో తమవంతు ప్రత్యేక పూజలు చేపడతారు.

ఈ నెల 26వ తేదీన వసంతోత్సవం, డోలోత్సవం నిర్వహించనున్నారు. ఆలయ అనువంశిక ధర్మకర్తలు పొందల శ్రీరాంబాబు నాయుడు కుటుంబం ఆర్థిక సాయంతో తొలిరోజు విశాఖపట్నంకు చెందిన శ్రీ కళాభినయ ఆర్ట్స్ బేనర్‌పై ‘ఓ కాశీ వాశీ రావయ్యా’అను సాంఘిక నాటికను ప్రదర్శించనున్నారు. ప్రతి రోజూ రాత్రి 8 గంటలకు బందరుకు చెందిన మడమల రాంబాబు భాగవతార్‌చే హరికథాగానం ఉంటుంది.

జపనీస్ భాషపై శిక్షణ

ఎచ్చెర్ల క్యాంపస్: జపనీస్ భాషపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి పీబీ సామిశ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ శిక్షణ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం, బీఎస్సీ నర్సింగ్ ఉన్న వారికి ఉపయోగ పడుతుందని అన్నారు. శిక్షణ అనంతరం జపాన్‌లో పనిచేసేందుకు సిద్ధం కావాల్సి ఉంటుందని తెలిపారు. అక్కడ నర్స్ ఉద్యోగాలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. 20 నుంచి 32 ఏళ్ల మధ్య మహిళలు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు హెచ్‌టీటీపీఎస్:/డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. స్కిల్ యూనివర్స్. ఏపీఎస్ఎస్‌డీసీ.ఐఎన్ వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మందస: మండలంలోని జాతీయ రహదారిపై కొర్రాయిగేటు సమీపంలో కొత్తకమలాపురం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. శ్రీకాకుళం చెందిన నందిని, నీలకంఠం ఈవెంట్ చేయడానికి ఇచ్ఛాపురం వెళ్తుండగా ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా.. పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో టెక్కలి జిల్లా ఆస్పత్రికి వైద్యులు రిఫర్ చేశారు. 108 వాహనం సిబ్బంది శంకర్, మురళీమోహన్ టెక్కలి ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.


పాతపట్నంలో రెండిళ్లలో చోరీ

పాతపట్నం: పాతపట్నంలోని విద్యానగర్‌లో శనివారం రాత్రి తాళం వేసిన రెండు ఇళ్లలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కింద ఇంటిలో యాజమాని మామిడి షణ్ముఖరావు శివరాత్రికు ఊరు వెళ్లడంతో ఇంటికి తాళం వేశారు. పై ఇంటిలో అద్దెకు ఉంటున్న ధర్మాన లోకనాథం శివరాత్రికి సొంత గ్రామం లాబరకు కుటుంబ సభ్యులతో వెళ్లారు. దీంతో దొంగలు శనివారం రాత్రి ఇళ్లలోకి జొరబడి షణ్ముఖరావు ఇంట్లో బెడ్ రూమ్‌లో ఉన్న బీరువాలో ఒక వెండి గ్లాస్, లోకనాథం ఇంట్లో బెడ్ రూమ్‌లో ఉన్న బీరువాలో తులంన్నర చైన్, ఒక ఉంగరం, చెవి దిద్దులు మొత్తం రెండున్నర తులాల బంగారం, రూ.5 వేల నగదు దొంగిలించారని బాధితులు తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఇంటి యాజమాని షణ్ముఖరావు వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. దీంతో ఆయన పోలీసులకు సమాచారం అందించారు. అదేవీధిలో మరో ఇంటిలో దొంగలు తాళం పగలుగొట్టడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. శ్రీకాకుళం నుంచి క్లూస్‌టీమ్ వచ్చి దర్యాప్తు చేశారు.

మళ్లీ నిరాశే

- రెండో రోజూ తాకని కిరణ స్పర్శ
- మళ్లీ అక్టోబర్‌లోనే కిరణ దర్శనం





అరసవల్లి: ఆదిత్య క్షేత్రంలో రెండో రోజు కూడా కిరణ స్పర్శ దర్శనం కలగలేదు. కిరణ దర్శనానికై వచ్చిన వందలాది మంది భక్తుల నిరీక్షణ ఫలించలేదు. ఆదివారం ఉదయం సూర్యోదయ సమయాన మబ్బులు కమ్మేయడంతో కిరణాలు గర్భాలయానికి చేరుకోలేదు. మబ్బులు కారణంగా ఈ ఆయనంలో రెండు రోజులూ కిరణ దర్శనం జరుగలేదని, మళ్లీ రానున్న అక్టోబర్ 1, 2 తేదీల్లో కిరణ స్పర్శ కనిపించే అవకాశం ఉందని ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తెలిపారు.

వంశధారకు నందీశ్వరుడు



సిద్ధం చేసిన నంది వాహనం

- శ్రీముఖలింగంలో నేడు త్రిశూల చక్రతీర్థ స్నానాలు
- నదిలో బారికేడ్లు ఏర్పాట్లు పూర్తి
- 300 మంది వరకూ పోలీసులతో బందోబస్తు



ఎల్.ఎన్.పేట:వంశధార నదిలో మిరియాపల్లి రేవు వద్ద బారికేడ్లు ఏర్పాటు

జలుమూరు, ఎల్ఎన్ పేట: శ్రీముఖలింగం శివరాత్రి ఉత్సవాల్లో చివరి రోజు గురువారం వంశధార నదిలో స్వామి త్రిశూల చక్రతీర్థ స్నానాలు జరగనున్నాయి. ఈ పుణ్యక్రతువుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ ఈఓ పి.ప్రభాకరరావు బుధవారం తెలిపారు. ప్రధాన ఆలయం నుంచి మధ్యాహ్నం 12 గంటలకు స్వామి ఉత్సవమూర్తులతో తూర్పుదిశన బయలు దేరి ఉత్తర దిశగా వంశధార నదికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వంశధార నదిలో రెండు వైపులా బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు రోడ్లు, భవనాల శాఖ అధికారులు తెలిపారు. లక్షల సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గ ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా ఆలయం నుంచి స్వామివారి ఉత్సవమూర్తులను నంది వాహనంపై తీసుకువెళ్లే సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, తోపులాటలు జరగకుండా దారి పొడవునా 8 రోప్ పార్టీలు వినియోగిస్తున్నామని నరసన్నపేట సీఐ బూర ప్రసాదరావు తెలిపారు. అలాగే ఆలయం వద్ద స్వామి దర్శనాలు, నదిలో బందోబస్తు, మిరాయపల్లి రేవులో పుణ్యస్నానాలు జరిగే సమయంలో భక్తులు రద్దీ, అల్లరిమూకలను నిలుపుదల, శ్రీముఖలింగం గ్రామానికి రెండువైపులా ట్రాఫిక్ నియంత్రణ, పుణ్యస్నానాలు అనంతరం భక్తులు తిరిగి వారి స్వగ్రామాలకు చేర్చడం ప్రధానమని సీఐ తెలిపారు. ఈ క్రతువుకు 300 మంది పోలీసు సిబ్బంది పనిచేస్తారని ఆయన తెలిపారు.

ఢిల్లీకి బీజేపీ నేతలు పయనం

భువనేశ్వర్: రాష్ట్రంలో జరగనున్న జంట ఎన్నికలు పురస్కరించుకుని బీజేడీతో పొత్తుపై ఎలాంటి చర్చలు జరగలేదని బీజేపీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు మన్మోహన్ సామల్ ఆదివారం పునరుద్ఘాటించారు. న్యూఢిల్లీ పయనం సందర్భంగా స్థానిక బిజూ పట్నాయక్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల వ్యవహారంలో రాష్ట్రం నుంచి కొంతమంది నాయకులు ఢిల్లీకి వెళ్తున్నట్లు తెలిపారు. కేంద్ర నాయకుల ఆధ్వర్యంలో ఢిల్లీలో జరగనున్న ఈ ప్రత్యేక సమావేశంలో రాష్ట్ర బీజేపీ ఎన్నికల వ్యవహారాల ఇన్‌చార్జి విజయ్‌పాల్ సింగ్ తోమర్, కో-ఇన్‌చార్జ్ లతా ఉసేంది, ప్రధాన కార్యదర్శి మానస్ మహంతి ఔత్సాహిక అభ్యర్థులకు సీట్ల కేటాయింపుపై చర్చిస్తారని చెప్పారు.

రాష్ట్రంలోని మొత్తం 147 అసెంబ్లీ స్థానాలు, 21 లోక్ సభ నియోజకవర్గాలపై సీట్ల కేటాయింపు, అభ్యర్థుల ఖరారు వంటి ఎన్నికల సంబంధిత చర్చ జరుగుతుందని సామల్ తెలిపారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఏ ప్రాంతీయ పార్టీతో పొత్తుపై ఏ నాయకులతో చర్చలు జరగలేదని స్పష్టం చేశారు..

మల్కన్‌గిరిలో స్వచ్ఛభారత్

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలోని మల్కన్‌గిరి కళాశాలలో ఆదివారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ లింగరాజ్ మిశ్రో ఆధ్వర్యంలో 75 మంది విద్యార్థులు పాల్గొని కళాశాల పరిసరాల్లో ఉన్న చెత్తా చెదారాలను తొలగించారు. జాతీయ సేవా పథకంలో భాగంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఇకపై ప్రతి నెలా స్వచ్ఛభారత్ నిర్వహిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు అశోక్ కుమార్ షోడాంగి, తపస్ బెహరా, ఉమేష్ చంద్ర రౌత్, ఆర్.క్రాంతిసాగర్, దీప్తిరేఖ మిశ్రో తదితరులు పాల్గొన్నారు.



స్వచ్ఛభారత్‌లో పాల్గొన్న విద్యార్థులు

క్రీడలపై ఆసక్తి పెరగాలి: ఎస్పీ



వాలీబాల్‌లో మొదటి బహుమతి సాధించిన యువకులకు ట్రోఫీని అందజేస్తున్న ఎస్పీ రాధిక

మెళియాపుట్టి: చదువుతో పాటుగా క్రీడలపై కూడా విద్యార్థులు ఆసక్తి కనబరచాలని ఎస్పీ జీఆర్ రాధిక సూచించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ ద్వారా ఇటీవల పాతపట్నం, మెళియాపుట్టి, హిరమండలం, కొత్తూరు మండలాల క్రీడాకారులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో గెలిచిన వారికి మెళియాపుట్టి మండలం చాపర జిల్లా పరిషత్ పాఠశాలలో ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. పోలీసులు సమాజ సేవకులని, తప్పు చేసిన వాళ్లే పోలీసులకు భయపడాలి గానీ మిగతా వారంతా స్నేహపూర్వకంగా మెలగాలని సూచించారు. మత్తు పదార్థాల వైపు వెళ్లవద్దని, ప్రేమ పేరుతో మోసపోవద్దని విద్యార్థులకు సూచించారు. ఎవరైనా వెంట పడి వేధిస్తే 112 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని, దిశ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని చెప్పారు. వాలీబాల్, క్రికెట్, కబడ్డీ తదితర పోటీల్లో కొత్తూరు మండలం మహార్తాపురం టీమ్, నివగాం టీమ్, పెద్దమడి పాఠశాల, చాపర యువకులు, పాతపట్నం లేజీ హార్స్ క్రికెట్ టీమ్‌ల యువకులు బహుమతులు అందుకున్నారు.

పోలీసుల తరఫున పలు గ్రంథాలయాలకు స్టడీ మెటీరియల్స్, కమ్యూనిటీ హాళ్లకు వాటర్ ప్యూరిఫైయర్లు అందించారు. టెక్కలి డీఎస్పీ బాలచంద్రారెడ్డి, పాతపట్నం సీఐ నల్లి సాయి, కొత్తూరు సీఐ వేణుగోపాలరావు, ఎస్ఐలు మెళియాపుట్టి రాజేష్, హిరమండలం నారాయణస్వామి, పాపటన్నం మహమ్మద్ యాసిన్, కొత్తూరు మహమ్మద్ అజాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో ప్రత్యేక పూజలు

అరసవల్లి: సూర్యనారాయణ స్వామి సన్నిధిలో మాఘమాస ఆదివారం సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేకంగా మొక్కులు చెల్లించి పూజలు నిర్వహించారు. మరోవైపు వత్సవలస రాజులమ్మ జాతర సందర్భంగా వేకువజాము నుంచే భక్తులు కుటుంబాలతో కలిసి విచ్చేయడంతో ముందుగా అరసవల్లి ఆదిత్యుడిని వారంతా దర్శించుకునేందుకు బారులు తీరారు. మహిళలు ఇంద్రపుష్కరిణి ఆవరణలో పిడకల పొయ్యిపై పాలను పొంగించి క్షీరాన్నాన్ని ప్రసాదంగా స్వామికి నివేదించారు. అలాగే పలువురు భక్తులు తలనీలాలను మొక్కుగా సమర్పించారు. ఇక ఆరోగ్యం కోసం భక్తులు సూర్యనమస్కార పూజలను చేయించుకున్నారు. భక్తులకు ఉచిత మంచి నీరు, ప్రసాదాలను పంపిణీ చేయడంతో పాటు అన్న ప్రసాద భోజనాన్ని కల్పించేలా ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు, సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు చర్యలు చేపట్టారు. అలాగే అంతరాలయంలో ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా స్వామి మూలవిరాట్టుకు అలంకరించి పూజలు నిర్వహించారు. ఆదివారం ఉదయం 6.30 గంటల నుంచే సర్వదర్శనాలకు అనుమతించారు. ఒక్క ఆదివారంలో మొత్తంగా రూ.4,53,272 ఆదాయం లభించింది. ఇందులో వివిధ దర్శనాల మార్గాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1,67,500, విరాళాలు, ఆర్జిత సేవల ద్వారా రూ.1,05,772, లడ్డూ, పులిహోర ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.80 లక్షల ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు తెలియజేశారు.



క్యూలైన్లలో కిక్కిరిసిన భక్తులు

ఆదిత్యుని సన్నిధిలో ఎస్పీ రాధిక

అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామిని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ జీఆర్ రాధిక కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ప్రత్యేక స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఈఓ డీఎల్‌వీ రమేష్‌బాబు వారికి ప్రసాదాలను అందజేశారు.

కేజీబీవీ విద్యాలయం బాలికా విద్యకు సోపానం

- 2024-25 విద్యా సంవత్సరానికి ఆహ్వానం
- 6వ తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలు
- ఈనెల 12 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ


వీరఘట్టం మండలం రేగులపాడు గ్రామంలో ఉన్న కేజీబీవీ

వీరఘట్టం: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆలోచనల్లోంచి పుట్టినదే కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం. నేడు కేజీబీవీలు బాలికా విద్యకు సోపానాలుగా నిలుస్తున్నాయి. ఆడపిల్లల చదువుకు పెద్దపీట వేస్తూ ఆనాడు నెలకొల్పిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ బాలికల ఉజ్వల భవిష్యత్‌కు శ్రీకారం చుట్టాయి. ప్రస్తుతం కేజీబీవీలో సీటు సంపాదించడం అంత ఈజీ కాదు. ఈ సీటు కోసం మినిస్టర్లు, ఎమ్మెల్యేలు కూడా సిఫార్సులు చేసే పరిస్థితి వచ్చిందంటే ఇక్కడ సీటుకు ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇక్కడే రెసిడెన్షియల్ విద్యను అందిస్తుండడంతో తల్లిదండ్రులు కూడా తమ పిల్లలను కేజీబీవీల్లో చేర్పించేందుకు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో 2024-25 విద్యా సంవత్సరంలో కేజీబీవీలో 6వ తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలు చేపట్టేందుకు ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వాటితో పాటు 7,8,9 తరగతుల్లో మిగులు సీట్లు కూడా భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ ఇచ్చింది. ఈనెల 12 నుంచి ఏప్రిల్ 11 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. కేజీబీవీలో చేరేందుకు అనాథలు, బడి బయట చిన్నారులు, బడి మధ్యలో మానేసిన బాలికలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న బాలికలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.

జిల్లాలో ఇదీ పరిస్థితి

పార్వతీపురం మన్యం జిల్లాలో వీరఘట్టం, సీతంపేట, భామిని, గరుగుబిల్లి, కురుపాం, జియ్యమ్మవలస, జీఎల్.పురం, పార్వతీపురం, సాలూరు, కొమరాడ, బలిజిపేట, మక్కువ, సీతానగరం, పాచిపెంట మండలాల్లో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు ఉన్నాయి. ప్రతి కేజీబీవీలో 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో 40 సీట్లు చొప్పున జిల్లా వ్యాప్తంగా అన్ని కేజీబీవీల్లో 6వ తరగతిలో 560 మంది బాలికలకు, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో 560 సీట్లను భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే 7వ తరగతిలో 16 సీట్లు, 8వ తరగతిలో 21 సీట్లు, 9వ తరగతిలో 10 మిగులు సీట్లను కూడా భర్తీ చేయనున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా అన్ని కేజీబీవీల్లో 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు 3,153 మంది బాలికలు ఈ ఏడాది విద్యనభ్యసిస్తున్నారు. గతేడాది టెన్త్‌లో 79 శాతం ఉత్తీర్ణత సాధించారు.ఇలా కేజీబీవీలు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ దినదినాభివృద్ధి చెందుతుండడంతో కేజీబీవీల్లో చదివేందుకు ఎక్కువ మంది బాలికలు ఇష్టపడుతుండడంతో సీట్లకు డిమాండ్ పెరిగింది.

చేరేందుకు కావాల్సిన పత్రాలు

కేజీబీవీలో చేరేందుకు బాలికలు దరఖాస్తు చేసుకునేందుకు బాలికతో పాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, రేషన్‌కార్డు, కులం, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, స్టడీ సర్టిఫికెట్, ఒక పాస్‌పోర్ట్ ఫొటోతో పాటు ఫోన్ నంబర్ ఉంటే ఏపీకేజీబీవీ. ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలకు ఆర్టీఈ టోల్‌ఫ్రీ నంబర్ 18004258599 నంబర్‌ను సంప్రదించవచ్చు.

ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాం



కేజీబీవీల్లో బాలికలకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తుండడంతో సత్ఫలితాలు వస్తున్నాయి.పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడిన మొదటి ఏడాదే టెన్త్‌లో 79 శాతం ఫలితాలు సాధించాం .అలాగే మహిళా టీచర్ల పర్యవేక్షణలో బాలికలకు రెసిడెన్షియల్ విద్యను అందిస్తుండడంతో కేజీబీవీల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. 2024-25 విద్యా సంవత్సరంలో చేరేందుకు ఈనెల 12 నుంచి ఏప్రిల్ 11వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం.బయట నెట్ సెంటర్లలో ఆన్‌లైన్ చేయవచ్చు. లేదా దగ్గరలో ఉన్న కేజీబీవీకి వెళ్లినా దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.

– కర్రి రోజారమణి, జీసీడీఓ, పార్వతీపురం మన్యం జిల్లా

'స్విఫ్ట్ చాట్'తో మెరుగైన బోధన


ఐఎఫ్‌పీ బోర్డు ద్వారా 10వ తరగతి విద్యార్థులకు డౌట్స్ నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయుడు

- ఐఎఫ్‌పీ, బైజూస్ ట్యాబ్స్‌తో యాప్ అనుసంధానం

రామభద్రపురం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాల విద్యలో వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోంది. విద్యార్థి సర్వతోముఖాభివృద్ధికి, అభ్యసన సామర్థ్యాలను పెంపొందించేందుకు డిజిటల్ విద్యను ప్రవేశపెట్టి విప్లవాత్మక చర్యలకు తెరతీసింది. బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్స్‌ను 8వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులకు అందజేసింది. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్(ఐఎఫ్‌పీ)ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయడమే కాకుండా.. వాటిని వినియోగించే విధానంపై ఉపాధ్యాయులకు శిక్షణనిచ్చింది. డిజిటల్ విద్యను మరింత అభివృద్ధి చేసే చర్యల్లో భాగంగా 'స్విఫ్ట్ చాట్'యాప్‌ను ప్రవేశపెట్టింది.ఉపాధ్యాయుల బోధన మరింత మెరుగుపర్చేందుకు ఈ యాప్‌ను ప్రతి ఉపాధ్యాయుడు ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశాలిచ్చింది. అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్‌పై పనిచేసేలా రూపొందించిన యాప్‌ను ప్రతి ఉపాధ్యాయుడు డౌన్‌లోడ్ చేసుకునే విధంగా ఉన్నత విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనికి సంబంధించిన లింక్‌ను కూడా విద్యాశాఖ ఉపవిద్యాశాఖాధికారులు, ఎంఈవోలు, హెచ్ఎంల ద్వారా టీచర్లకు చేరవేసింది. లింక్‌తో పాటు ఇన్‌స్టాలేషన్ ఏ విధంగా చేసుకోవాలో తెలియజేసే సమాచారాన్ని పంపించారు. ఇప్పటికే 99 శాతం మంది ఉపాధ్యాయులు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు.

గణితం, సైన్స్ ఉపాధ్యాయులకు ఓరియంటేషన్..

ఇన్‌ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీపై ఇప్పటికే గణితం, ఫిజికల్, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు ఒక రోజు ఓరియంటేషన్ తరగతులు నిర్వహించారు.ఈ తరగతుల్లో స్విఫ్ట్ యాప్, ఓల్యాబ్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెంట్ అసిస్టెంట్ ఫర్ టీచర్స్, చాట్ జీపీటీ వంటి యాప్స్, పలు వెబ్‌సైట్లపై అవగాహన కల్పించారు.

స్విఫ్ట్ చాట్ అంటే..

ఉపాధ్యాయులు బోధన చేసే సమయంలో విద్యార్థుకు సబ్జెక్టు పరంగా సమగ్రమైన జ్ఞానాన్ని అందించాల్సి ఉంటుంది.బోధనలో భాగంగా తెలియని అంశాన్ని వాట్సాప్ చాట్ మాదిరిగానే స్విఫ్ట్ చాట్‌లో ఎస్ఎంఎస్ చేస్తే క్షణాల్లో సంబంధిత సమాచారం యాప్‌లో ప్రత్యక్షమవుతుంది. ఈ యాప్‌లో 1వ తరగతి నుంచి 12వ తరగతి వరకు తరగతుల వారీగా డిజిటల్ తరగతులు, లైవ్ క్విజ్‌లు, కాంపిటేషన్ జోన్, స్కిల్ కార్నర్‌లు, రికార్డులు పొందుపర్చారు. నచ్చిన అంశాన్ని సేవ్ ఐటమ్స్‌లో స్టోర్ చేసుకునే అవకాశం యాప్‌లో ఉంది. ప్రస్తుతం ఒకటి, రెండు తరగతులకు గణితం, మూడు నుంచి ఆరవ తరగతి వరకు గణితం, సైన్స్ సబ్జెక్టులపై మాత్రమే డిజిటల్ తరగతులు, క్విజ్‌లు అందుబాటులో ఉన్నాయి.మిగిలిన సబ్జెక్టులపై కూడా భవిష్యత్‌లో డిజిటల్ తరగతులు పొందుపర్చనున్నారు.

రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి



స్విఫ్ట్ చాట్ యాప్‌ను ఉపాధ్యాయుల ఆండ్రాయిడ్ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకొని, రిజిస్ట్రేషన్ చేసుకొనే ప్రక్రియ పూర్తికావచ్చింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు కూడా యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు. సాంఘిక సంక్షేమం, గురుకుల పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు మినిమమ్ టైమ్ స్కేల్‌లో పనిచేసే ఉపాధ్యాయులకు త్వరలో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశమిస్తాం.

– ప్రేమ్‌కుమార్, డీఈవో, విజయనగరం

క్లుప్తంగా

ప్రారంభానికి సిద్ధమైన యాగశాల


పూర్తయిన యాగశాల

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శాశ్వత యాగశాల నిర్మాణం ప్రారంభానికి సిద్ధమైంది. ఈ నెల 11న ప్రారంభించేందుకు దేవస్థాన అధికారులు సన్నద్ధమయ్యారు. యాగశాల ప్రారంభానికి సంబంధించి ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. దేవాలయంలో శాశ్వత యాగశాల లేకపోవడంతో అర్చకులు నానా అవస్థలు పడేవారు. తాటాకుల కమ్మలతో ఉండే యాగశాల ఉండడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం వెంటాడేది. యాగశాలతో పాటు ఆలయంలో ఫ్లోరింగ్, సుందరీకరణ పనులకు ప్రభుత్వం కోటి రూపాయల నిధులు మంజూరు చేయడంతో నిర్మాణం పూర్తి చేశారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబు చేతుల మీదుగా యాగశాల ప్రారంభం కానుందని ఆలయవర్గాలు తెలిపాయి. శాశ్వత యాగశాల పూర్తి కావడంతో అర్చకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పూరిల్లు దగ్ధం

గంట్యాడ: మండలంలోని బురదపాడు గ్రామం బీసీ కాలనీలో గ్రామానికి చెందిన పెంటబోను అర్జున పూరిల్లు అగ్ని ప్రమాదంలో ఆదివారం కాలి బూడిదైంది. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న సుమారు రూ.80 వేలు విలువ చేసే వస్తు సామగ్రి అగ్నికి ఆహుతైంది. ప్రమాదం జరిగిన వెంటనే వీఆర్వో లావణ్య సంఘటన స్థలాన్ని సందర్శించి ప్రాథమిక నివేదికను తహసీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డికి అందజేశారు. ఈ నివేదికకు కలెక్టర్‌కు పంపిస్తామని తహసీల్దార్ చెప్పారు.

25 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్ట్


మాట్లాడుతున్న జీఆర్‌పీ లైన్స్ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు, ఎస్సై రవివర్మ, (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: రైళ్లలో గంజాయి సరఫరా చేస్తున్నట్లు వచ్చిన సమాచారం ఆధారంగా కొద్దిరోజులుగా ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్న జీఆర్‌పీ సిబ్బంది ఆదివారం 25.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరి మహిళలను అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ కె.వెంకటరావు మాట్లాడుతూ ఒడిశా రాష్ట్రంలోని కొరాపుట్ జిల్లాకు చెందిన సుమిత్ర బైదైక్, రేఖలను అరకు రైల్వేస్టేషన్ మీదుగా విశాఖ, కొత్తవలస వైపు వస్తున్న రైల్లో అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 25.4 కిలోల గంజాయిని సీజ్ చేసి, ఇద్దరినీ అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలిస్తామని జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ చెప్పారు.

పేకాట శిబిరంపై దాడి

బొబ్బిలి: మండలంలోని పెంట గ్రామ శివారులో పేకాడుతున్న పది మందిని అరెస్టు చేసినట్టు ఎస్సై జి.లోవరాజు తెలిపారు. వారి నుంచి రూ.29,630లు, పేక ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

57 మద్యం సీసాలు స్వాధీనం

గజపతినగరం రూరల్: ద్విచక్రవాహనంపై అక్రమంగా తరలిస్తున్న 57మద్యం సీసాలను గజపతినగరం మండలంలోని లింగాలవలస కూడలి వద్ద స్వాధీనం చేసుకున్నామని గజపతినగరం ఎస్సై మహేష్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానికుల సమాచారం మేరకు మాటు వేసి వాహనదారుడిని పట్టుకున్నట్లు చెప్పారు. వాహనంతో పాటు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని సంబంధిత వ్యక్తిపై కేసు నమోదుచేశామన్నారు. కార్యక్రమంలో ఎస్సైతో పాటు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


మృతుడు కిరణ్ (ఫైల్)

విజయనగరం క్రైమ్: స్థానిక మయూరి కూడలి వద్ద నున్న నాగోజీపేటలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనికి సంబంధించి వన్ టౌన్ పోలీసులు ఆదివారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మయూరి జంక్షన్ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న నాగోజీపేటలో నివాసముంటున్న కె.కిరణ్‌కుమార్ (29) తల్లిదండ్రులు కొన్నాళ్ల కిందట మృతిచెందడంతో అక్క వద్ద ఉంటున్నాడు. అయితే సరైన ఉద్యోగం లేకపోవడంతో డిప్రెషన్‌కి గురయ్యాడు. కొద్దిరోజులుగా ఒంటరిగా గదిలో ఒక్కడే ఉంటూ మనస్తాపం చెంది, జీవితంపై విరక్తి పొంది శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత సీలింగ్ ఫ్యాన్ హుక్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదివారం ఉదయం 9 గంటల ప్రాంతంలో కిరణ్ ఇంటి తలుపులు తీసి ఉండడాన్ని గమనించిన కుటుంబసభ్యులు లోపలికి వెళ్లి చూసేసరికి ఉరివేసుకుని మృతిచెంది కనిపించాడు. దీంతో వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై నవీన్‌పడాల్ సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించి, మృతదేహాన్ని జిల్లా కేంద్రాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడికి అక్క, అన్నయ్య ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై నవీన్‌పడాల్

అంతర్ వర్సిటీల క్రీడాపోటీలకు సీతం విద్యార్థి ఎంపిక


విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: జాతీయస్థాయిలో జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడాపోటీలకు అథ్లెటిక్స్ క్రీడాంశంలో స్థానిక గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థి ఎం.సాయిజశ్వంత్ ఎంపికయ్యాడు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీరామమూర్తి ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. పోటీలకు పదివేల మీటర్ల విభాగంలో అర్హత సాధించాడని తెలిపారు. మహరాష్ట్రలోని నాందేడ్ ఎస్ఆర్‌టీఎం యూనివర్సిటీలో శని, ఆదివారాల్లో ఐదు రాష్ట్రాల పరిధిలో జరిగిన పోటీలలో ప్రతిభ చూపడంతో ఎంపికయ్యాడని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థిని కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ జి.వేణుమాధవరావు, సీఎస్ఓ కోరాడ సత్యనారాయణ, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

నేడు జాతర సమన్వయ సమావేశం

చీపురుపల్లి: శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం ఆవరణలో సోమవారం శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతర మహోత్సవాలకు సంబంధించిన సమన్వయ సమావేశం నిర్వహించనున్నట్లు దేవదాయ శాఖ ఈఓ జి.శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు అమ్మ వారి దేవస్థానంలో ఆలయ కమిటీ, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై జాతర నిర్వహణ కోసం చర్చించనున్నట్టు పేర్కొన్నారు. ఈ నెల 17, 18, 19 తేదీల్లో శ్రీ కనకమహాలక్ష్మి అమ్మవారి 26వ జాతర మహోత్సవాలు జరగనున్నాయని తెలిపారు.

పారామెడికల్ ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఉత్తర్వుల జారీ


రెగ్యులర్ అయిన ఉద్యోగులతో డీఎంహెచ్ఓ భాస్కరరావు

విజయనగరం ఫోర్ట్: వైద్య ఆరోగ్య శాఖలో 20 ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులకు క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జీఓ నెంబర్ 30, 31 యాక్ట్‌కు అనుగుణంగా శనివారం రాత్రి ఉద్యోగులకు ఉత్తర్వులు జారీ చేశారు. మొదటి జాబితాలో 100 మంది ఉద్యోగులకు ఆదివారం డీఎంహెచ్ఓ భాస్కరరావు రెగ్యులర్ ఉత్తర్వులు అందజేశారు. వీరిలో 70 మంది హెల్త్ అసిస్టెంట్లు, 12 మంది ల్యాబ్ టెక్నీషియన్లు, 10 మంది ఏఎన్ఎంలు, 8 మంది ట్రైబల్ హెల్త్ అసిస్టెంట్లు ఉన్నారు. ఈ సందర్భంగా పారా మెడికల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రతినిధి వి.వి.ఎస్.ఆర్. ప్రసాద్ మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ చిత్తశుద్ధితో అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారని అన్నారు. సబ్ కమిటీలో కీలక పాత్ర పోషించిన జిల్లా మంత్రి బొత్స సత్యనారాయణకు, వైద్య శాఖ ఉన్నతాధికారులకు కృతజ్ఞత లు తెలిపారు.

స్కూటీ అదుపు తప్పి బాలుడి మృతి


మృతిచెందిన రాకేష్ (ఫైల్)

జామి: మండల కేంద్రంలోని కేజీబీవీ ఎదురుగా స్కూటీ అదుపు తప్పి బోల్తా పడడంతో ఓ బాలుడు దుర్మరణం చెందాడు. ఈ ప్రమాద సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కుమరాం గ్రామానికి చెందిన దేవ సన్యాసిరావు, రాజ్యలక్ష్మి దంపతుల కుమారుడు రాకేష్ (15) స్థానిక జెడ్పీ ఉన్నతపాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. కుమరాంలోనే ఆదివారం తన చిన్నాన్న కుమార్తె శుభకార్యం నిమిత్తం వెళ్లి అందరితో ఆనందంగా గడిపాడు. సాయంత్రం స్కూటీ తీసుకుని విజయనగరం రహదారి వైపు వెళ్లాడు. స్థానిక కేజీబీవీ ఎదురుగా వచ్చేసరికి కుక్క అడ్డం రావడంతో బైక్ అదుపు తప్పి కిందకు పడిపోయా డు. ఈ క్రమంలో తలకు బలమైన గాయం అవ్వడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై వీరబాబు తెలిపారు. కుమారుడు చనిపోవడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలిక

భోగాపురం: మండలంలోని ముక్కాం గ్రామంలో ఈనెల 3న దువ్వ పోలయ్య ఇంట్లో ప్రమాదవశాత్తు పొయ్యి మీద మరుగుతున్న వేడినీళ్లు తన కుమార్తె కావ్య (11)పై పడడంతో తీవ్రంగా గాయపడి ఆస్పత్రి పాలైంది. ఈ క్రమంలో విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు సీఐ రవికుమార్ తెలిపారు.

బైక్ అదుపుతప్పి వివాహిత


కుమారి (ఫైల్)

పాలకొండ రూరల్: పట్టణంలోని లుంబూరువారి వీధికి చెందిన దుప్పాడ కుమారి(28) రోడ్డు ప్రమాదంలో మరణించింది. వివరాలిలా ఉన్నాయి. కుటుంబ పోషణలో భాగంగా భర్త సింహాంద్రికి తోడుగా నిలిచేందుకు తాను కూడా కష్టపడాలని నిర్ణయించుకున్న కుమారి మండలంలోని పణుకువలస సమీపంలో గల ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తోంది. రోజులాగానే సహచరులతో కలిసి పనులకు ఆదివారం పయనమైంది. తనతోపాటు పని చేస్తున్న శ్రీరామూర్తి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రాజుపేట కానా వద్ద రోడ్డుపై ముంగిస అడ్డుగా రావడంతో బైక్ సడన్ బ్రేక్ వేయగా వాహనం అదుపుతప్పింది. దీంతో వాహనం వెనుక కూర్చున్న కుమారి ఒక్కసారిగా రోడ్డుపై పడిపోయింది. దీంతో ఆమె గుండె, తల బలంగా రోడ్డును తాకడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. వెనుక ఆటోలో వస్తున్న సహచరులు ప్రమాదాన్ని గమనించి తక్షణమే తమ ఆటోలో పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీరామూర్తి స్వల్పగాయాలతో బయటపడగా కుమారి పరిస్థితి విషమించడంతో వైద్యులు శ్రీకాకుళం రిఫర్ చేసారు. అక్కడ చికిత్స పొందుతూ కుమారి మృతిచెందింది. కుమారి మరణించడంతో భర్త, ఇద్దరు కుమార్తెలు గుండెలవిసేలా రోదించారు.

ముగ్గురు జూదరుల అరెస్ట్

దత్తిరాజేరు: మండలంలోని ఆర్.రామచంద్రాపురం సమీపంలోని తోటలో పేకాట ఆడుతున్న ముగ్గురిని పట్టుకుని ఆదివారం అరెస్ట్ చేసినట్లు ఎస్.బూర్జవలస ఎస్సై లక్ష్మీప్రసన్నకుమార్ తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు స్థానికుల నుంచి సమాచారం రావడంతో వెళ్లి దాడి చేసి ముగ్గురిని పట్టుకుని వారి నుంచి రూ.5,020 నగదు స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఇద్దరు కోడి పందాల రాయుళ్లు

కొత్తవలస: మండలంలోని రాజుపాత్రునిపాలెం గ్రామం సమీపంలో రహస్యంగా నిర్వహిస్తున్న కోడి పందాలపై సీఐ ఎస్.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం సాయంత్రం దాడి చేశారు. కోడిపందాలు ఆడుతున్న ఇద్దరు వ్యక్తులను ఆదుపులోకి తీసుకుని వారి నుంచి రెండు కోడి పుంజులను, రూ 3వందల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

పట్టాలు తప్పిన పాసింజర్ రైలు

- విశాఖ – భవానీపట్నం రైలుకు తప్పిన పెను ప్రమాదం
- భయాందోళనకు గురైన ప్రయాణికులు
- పునరుద్ధరణ పనులు ప్రారంభించిన రైల్వే అధికారులు
- ప్రయాణికుల తరలింపునకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు


పక్కకు ఒరిగిన రైలు ఇంజిన్


పట్టాలు తప్పి, ఒక వైపు ఒరిగిపోయిన రైలు బోగి

కొత్తవలస :

ఆ పాసింజర్ రైలులో ప్రయాణికులు కబుర్లు చెబుతూ హాయిగా ప్రయాణం చేస్తున్నారు. ఇంతలోనే చిమ్మచీకట్లో ఒక్కసారిగా పెద్ద కుదుపు వచ్చి ఒక్కసారిగా రైలు ఆగిపోయింది. ఏమైందో తెలియక ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రైలు నుంచి దిగి స్టేషన్ వైపు పరుగులు తీశారు. రైలు ఇంజిన్ పట్టాలు తప్పిందని తెలిసేసరికి స్థానికులు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకున్నారు. వివరాల్లోకి వెళ్తే... రైలు నంబరు 08504 విశాఖపట్నం – భవానీపట్నం ప్రత్యేక పాసింజర్ రైలుకు ఆదివారం రాత్రి పెను ప్రమాదం తప్పింది. విశాఖపట్నం రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరిన ఈ రైలు కొత్తవలస స్టేషన్‌కు సుమారు రాత్రి 7 గంటలకు చేరుకొంది. అక్కడ నుంచి బయలుదేరిన నాలుగు నిమిషాలకే కొత్తవలస జంక్షన్ సమీపంలోని డౌన్ లైన్ నుంచి మధ్య లైన్‌లోకి రైలు మళ్లే సమయంలో ఇంజిన్, మరో బోగి పట్టాలు తప్పి ఓ వైపు ఒరిగిపోయాయి. వెంటనే పైలెట్లు అప్రమత్తమై రైలును ఆపేశారు. ఎటువంటి ప్రాణాపాయం లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అప్పటికే డౌన్ లైన్ నుంచి మధ్య లైన్‌కు మళ్లే పాయింట్ వద్ద సుమారు నాలుగు మీటర్ల వరకు ట్రాక్ పూర్తిగా దెబ్బతింది. రైలు ప్రయాణికులు పాసింజర్ రైలు దిగి కొత్తవలస రైల్వేస్టేషన్‌కు వెళ్లిపోయారు. ప్రమాదాన్ని గుర్తించిన రైల్వే అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని కారణాలు తెలుసుకున్నారు. రైలు ఇంజిన్, రెండు పెట్టెలను అక్కడ విడిచిపెట్టి మిగిలిన బోగీలను కొత్తవలస రైల్వేస్టేషన్‌కు తరలించారు. ప్రయాణికులను తమ గమ్య స్థానాలకు చేర్చేందుకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు.

రైళ్ల రాకపోకలకు ఆటంకం

కాగా రాత్రి 7 గంటల నుంచి 8.30 గంటల వరకు రైళ్ల రాకపోకలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. ఎక్కడ రైళ్లు అక్కడే నిలిచిపోయాయి. 8.30 గంటల నుంచి విజయనగరం నుంచి విశాఖపట్నం వైపు ట్రైన్‌లు వెళ్లేందుకు అవకాశం కల్పించారు. అలాగే విశాఖపట్నం నుంచి విజయనగరం వైపు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది.

పునరుద్ధరణ పనులు ప్రారంభం

లైన్ క్లియర్ చేసేందుకు రైల్వే అధికారులు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులను చేపట్టారు. రాత్రి 11 గంటల సమయానికి రైళ్ల రాకపోకలకు అవకాశం కల్పిస్తామని రైల్వే అధికారులు తెలిపారు. కాగా పైలెట్ ఎం.హరికృష్ణ, కో పైలెట్ ఎస్.కె.సింగ్, గార్డు వాసుదేవరావులకు రైల్వే ఆరోగ్య సిబ్బంది మెడికల్ పరీక్షలను నిర్వహించారు.